సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 10 । మార్చి । 2024



ఘోర ప్రమాదం..మహా విషాదం

మన్యంలో దుమ్ముబుద్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. IIలో



'స్నో'యగం

అనంతగిరిలో ఉదయం ఎండతీవ్రత నెలకొనగా, సాయంత్రం ఒక్కసారిగా మంచుతెరలు కమ్మేశాయి. IIలో



రెగ్యులర్ టీచర్లుగా సీఆర్టీలు

ట్రైబల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న సీఆర్‌టీలను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ మేరకు కలెక్టర్ విజయసునీత ఉత్తర్వులిచ్చారు. IIలో





పాడేరులో నిర్మిస్తున్న వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం

ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్న విశాఖ మన్యం ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో ప్రగతిపథంలో దూసుకుపోతోంది. రూ.వందల కోట్లతో జాతీయ రహదారి.. మరోవక్క రూ.500 కోట్లతో వైద్య కళాశాల, రూ.వేల కోట్లతో జలవిద్యుత్ ప్రాజెక్టుల రూపకల్పనతో గిరిజన ప్రాంతం రూపురేఖలు మారిపోతున్నాయి. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. మారుమూల గ్రామాలకు సైతం రవాణా, సమాచార వ్యవస్థలు అందుబాటులోకి తీసుకురావడంతో గిరిజనుల్లో పట్టరాని ఆనందం నెలకొంది.

ఇంటింటా వెలుగులు

సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఇప్పుడు ఊహించని విధంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టిపెట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడేరు కేంద్రంగా రంపచోడవరం, చింతూరు, పాడేరు డివిజన్లను కలుపుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పాటుచేసింది. గిరిజనులకు పాలనను మరింత చేరువ చేసింది.

22 మండలాలతో..

జిల్లాల పునర్విభజనకు ముందు తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 11 మండలాలు, విశాఖపట్నం జిల్లా పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాలు ఉండేవి. ఇప్పుడు రంపచోడవరం, పాడేరు డివిజన్లను కలుపుతూ గిరిజన ప్రాంతమంతా ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైంది. దీని పరిధిలో అరకు పార్లమెంట్ నియోజకవర్గం రంపచోడవరం, పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు, 22 మండలాలు, 352 పంచాయతీలు ఉన్నాయి.

నాడు–నేడులో పీహెచ్‌సీలు

జిల్లాలోని 47 పీహెచ్‌సీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.22.69 కోట్లు వెచ్చించింది. జిల్లాలో 12 చోట్ల రూ.18.74 కోట్లతో కొత్త పీహెచ్‌సీలను నిర్మించింది. చింతపల్లిలో రూ.20 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది.

- రెవెన్యూ డివిజన్ కేంద్ర రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం వంద పడకలు ఉన్నాయి. తల్లీబిడ్డల



సారవానిపాలెం మార్గంలో గోస్తనీ నదిపై భారీ బ్రిడ్జి

వైద్యసేవలకు సంబంధించి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. రూ.49.26 కోట్లతో సూపర్ స్పెషాలిటీ భవనం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

వ్యవసాయానికి ఊతం

జిల్లాలోని 1.69 లక్షల మంది గిరిజన రైతులకు రైతు భరోసా కింద ఏటా రూ.127 కోట్ల ప్రభుత్వం జమచేస్తోంది. ఏటా 90శాతం రాయితీపై వరి, రాజ్మా, రాగులు, చిరుధాన్యాల విత్తనాలను పూర్తిస్థాయిలో సరఫరా చేస్తోంది. ఆపరేషన్ పరివర్తనలో గంజాయికి ప్రత్యామ్నాయంగా పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలోని మారుమూల గ్రామాల రైతులకు రూ.6.31కోట్ల విలువచేసే విత్తనాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేసి వారిలో మార్పునకు శ్రీకారం చుట్టింది.

అటవీ భూములపై హక్కులు

అటవీ భూమిని సాగు చేస్తున్న 1,40407 మందికి అటవీ హక్కుల పత్రాలను పంపిణీ చేసింది. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన 56,973 మందికి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా వర్తింపుతో పెట్టుబడి కష్టాలు తప్పాయి.

కాఫీ రైతులకు సహకారం

మన్యంలో గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న కాఫీసాగుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. జిల్లాలో 2,31893 మంది గిరిజన రైతులు 2,02,021 ఎకరాల్లో కాఫీతోటలను సాగు చేస్తున్నారు. వీటిలో ఏటా 1.60లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇస్తున్నాయి. 15వేల మెట్రిక్ టన్నులు దిగుబడి సాధిస్తున్నారు. దళారి వ్యాపారుల బెడద లేకుండా పాడేరు ఐటీడీఏ గిట్టుబాటు ధర కల్పిస్తోంది. గిరిజన సహకార సంస్థ కూడా రికార్డు ధర చెల్లిస్తూ కాఫీ గింజలను కొనుగోలు చేసింది. అలాగే కాఫీ రైతుల సౌకర్యార్థం జీకేవీధిలో రూ.2.27కోట్లు, జి.మాడుగులలో 2.37 కోట్లతో కాఫీ పల్పింగ్ యూనిట్ల నిర్మాణం చేపట్టింది.

రూ.400 కోట్లతో 2061 సెల్‌టవర్లు

కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.400 కోట్లతో 2061 సెల్‌టవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 378 సెల్ టవర్లను సీఎం ప్రారంభించడంతో 1100 గ్రామాలకు 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఇంటింటికీ సురక్షిత తాగునీరు

అన్ని గ్రామాల్లో గిరిజనులకు ఇంటింటికి సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకాల నిర్మాణం చేపట్టింది. జిల్లాలో 7,135 తాగునీటి పథకాల నిర్మాణం రూ.629.72 కోట్లతో చేపట్టగా 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి.

సీఎం జగన్ చొరవతో..



చింతూరు ఆస్పత్రిలో డయాలసిస్ విభాగం

చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. 2020లో కిడ్నీ వ్యాధి కారణంగా 20 మంది చనిపోయారు. ఈ ప్రాంతానికి వచ్చిన అప్పటి వైద్యశాఖ మంత్రి ఆళ్ల నాని సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే హుటాహుటిన ఆరు పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కావడంతో చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల ప్రజలకు అవస్థలు తప్పాయి.

సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
రైతుభరోసా	1,69,000	127
అమ్మ ఒడి	1,01,170	152
పింఛన్‌కానుక	1,28,962	469.08
చేయూత	53,735	100.81
ఆసరా	85,167	134.37
కాపునేస్తం	1510	2.26
వాహన మిత్ర	3,353	3.35
సున్నా వడ్డీ	12,818	19.26
జగనన్నతోడు	7,862	7.86
కళ్యాణమస్తు	942	9.35
విద్యాదీవెన	13,578	17.31
వసతిదీవెన	7,550	7.25
ఆరోగ్యశ్రీ	10,634	22.38
ఆసరా	6,735	5.31
గృహనిర్మాణం	15,783	62.98
వైఎస్సార్‌బీమా	2058	26.33

రూ.500 కోట్లతో వైద్య కళాశాల



పాడేరులో నిర్మిస్తున్న వైద్యకళాశాల భవనం

మన్యంలో వైద్యసేవలు అందని ద్రాక్షలా మారిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రమైన పాడేరు రూ.500 కోట్లతో 35 ఎకరాల విస్తీర్ణంలో వైద్యకళాశాల నిర్మాణం చేపట్టింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిని ఆధునిక వైద్య సౌకర్యాలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. వైద్య నిపుణులను నియమించి ఉన్నత వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతకు ముందు అత్యవసర కేసులను కేజీహెచ్, రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఇక్కడ అన్ని రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రావడంతో అత్యవసర వైద్యం అందడంతో రిఫర్ కేసులు తగ్గాయి. కొద్ది రోజుల్లో 600 పడకలు అందుబాటులోకి రానున్నాయి.

పర్యాటకంగా..



చెరువులవేనంలో వ్యూ పాయింట్



బోడకొండమ్మ తల్లి వ్యూపాయింట్

ఏజెన్సీలో టూరిజం అభివృద్ధికి పాడేరు ఐటీడీఏ చర్యలు తీసుకుంది.రెండేళ్ల క్రితం అరకులోయ గిరిజన మ్యూజియంను రూ.50లక్షలతో ఆధునికీకరించారు. జిప్ లైనర్, జిప్ సైకిల్ వంటి సాహసక్రీడలను అందుబాటులోకి తెచ్చారు.

- డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతాన్ని కూడా రూ.50 లక్షలతో అభివృద్ధి చేయడంతో పర్యాటకులకు అనువుగా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. లంబసింగి ప్రాంతంలోని చెరువులవేనంలో వ్యూపాయింట్‌ను ఎంపీ నిధులు రూ.26.50 లక్షలతో నిర్మించారు. మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా రూ.50 లక్షలతో చెరువులవేనంకు మట్టిరోడ్డును పాడేరు ఐటీడీఏ నిర్మించింది. తారురోడ్డుకు కార్యచరణ రూపొందించింది. లంబసింగి ఘాట్‌లోని బోడకొండమ్మ గుడి సమీపంలోను వ్యూపాయింట్ ఎంపీ నిధులు రూ.50 లక్షలతో నిర్మించారు.


మిషన్ కనెక్ట్ పాడేరుతో..

పాడేరు ఐటీడీఏ పరిధిలో రోడ్డు లేని మారుమూల గ్రామాలకు మిషన్ కనెక్ట్ పాడేరుతో రోడ్ల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టింది. రూ.732 కోట్లతో మిషన్ కనెక్ట్ పాడేరుకు రూపకల్పన చేసింది. తొలివిడతలో 514 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేలా రూ.274 కోట్లతో నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రోడ్లు, వంతెనల నిర్మాణం

జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు రోడ్లు, గెడ్డలపై వంతెనల నిర్మాణాలు శరవేగంతో జరుగుతున్నాయి. ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ, పీఎంజీఎస్‌వై, ఏఐఐబీ, ఎస్‌సీఏ పనులు 502కుగాను రూ.502.89 కోట్లు కేటాయించింది. దీంతో గిరిజనులకు రాకపోకల సమస్య తప్పనున్నాయి. పీవీటీజీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.11.15కోట్ల సీసీడీపీ నిధులతో 69 పనులు జరుగుతున్నాయి.

దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్ట్‌గా..



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



ఐదు, ఆరు యూనిట్ల నిర్మాణ పనులు

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. దీని స్థాయి పెంచుతూ అదనంగా 230 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్ల నిర్మాణం జరుగుతోంది. ఇందుకు ప్రభుత్వం రూ.530 కోట్లు వెచ్చించింది. 2005 నాటికి అందుబాటులో వస్తే 690 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి సాధ్యపడుతుంది.

వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ

సీలేరు రివర్స్‌బుల్ పంప్డ్ స్టోరేజీ సుమారు వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో కసరత్తు మొదలైంది. ఒకొక్క యూనిట్ 150 మెగావాట్ల సామర్థ్యంతో 9 యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకుగాను రూ.260 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. టెండర్లు ఖరారయ్యాయి. పర్యవరణ, అటవీశాఖ క్లియరెన్సు రావల్సి ఉంది. ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు పనులు వేగవంతం చేశారు. దేశంలోని అతిపెద్ద ప్రాజెక్టుగా నిలవనుంది.

కార్పొరేట్ లుక్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కార్పొరేట్ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాడు–నేడు మొదటి విడతలో 581 పాఠశాలలను రూ.165.27 కోట్లతో తీర్చిదిద్దింది. రెండవ విడతలో 967 పాఠశాలల అభివృద్ధికి రూ.108.36 కోట్లు వెచ్చించింది. ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. జిల్లాలోని 20 జూనియర్ కళాశాలలను రూ.11.55 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.



జైపూర్ జంక్షన్‌లో కార్పొరేట్‌ను తలపించేలా కిల్లోగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు..



తుంపాడలో గ్రామసచివాలయం, ఆర్‌బీకే భవనాలు

జిల్లాలో సచివాలయ వ్యవస్థకు సంబంధించిన భవనాలను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. 349 సచివాలయాల భవనాలకు రూ.140.10 కోట్లు, 344 ఆర్‌బీకేలకు రూ.74.99 కోట్లు, 208 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు రూ.36.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఇప్పటివరకు 152 భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయి.

అద్దంలా ఆర్‌అండ్‌బీ రోడ్లు..

జిల్లాలోని అన్ని ఆర్‌అండ్‌బీ రోడ్లను ప్రభుత్వం రెండేళ్ల నుంచి అభివృద్ధి చేసింది.జిల్లా పరిధిలోని స్టేట్ హైవేలుగా గుర్తింపు పొందిన పలు చోట్ల 81.916 కిలోమీటర్ల రోడ్డును రూ.32.03కోట్లు, మేజర్ జిల్లా రోడ్లలో 24.455 కిలోమీటర్లను రూ.9.18 కోట్లతో అభివృద్ధి చేసింది.

చురుగ్గా జాతీయ రహదారి నిర్మాణం

రంపచోడవరం ప్రాంతంలోని పోలవరం జంక్షన్ నుంచి పాడేరు,అరకులోయ నియోజకవర్గాల మీదుగా విజయనగరం జిల్లా బొడ్డవర జంక్షన్ వరకు ఎన్‌హెచ్516ఈ పేరుతో రూ.2,110 కోట్లతో 257 కిలోమీటర్ల రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే పాడేరు నుంచి అరకులోయ వరకు 42 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది.



ముంచంగిపుట్టు మండలం మారుమూల రంగబయలుకు నిర్మించిన తారు రోడ్డు

క్లుప్తంగా

కాఫీ రైతుల అధ్యయన యాత్ర



అధ్యయన యాత్రకు బయలుదేరిన కాఫీబోర్డు అధికారులు, రైతులు

సాక్షి,పాడేరు: కాఫీతోటల సాగు, సస్యరక్షణ, అధిక దిగుబడి సాధించడంపై అవగాహన పొందేందుకు కాఫీ రైతులు కర్ణాటక బయలు దేరారు. మినుములూరులోని కేంద్రకాఫీబోర్డు డీడీ రమేష్ ఆధ్వర్యంలో ఆరు మండలాలకు చెందిన 12 మంది రైతులు వెళ్లారు. ఏడు రోజుల పర్యటనలో భాగంగా కాఫీ సాగులో అధిక దిగుబడుల సాధనకు మెళకువలు తెలుసుకుంటారని ఆయన తెలిపారు.

12న రాజవొమ్మంగిలో ఉన్నతి జాబ్ మేళా

రాజవొమ్మంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి నిరుద్యోగ యువతీయువకులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఉపాధి హామీ పీవో/ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు తెలిపారు. టెన్త్ ఆపై చదువుకొని ఖాళీగా వున్న యువతీయువకులు అందరూ ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలలోని నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. అభ్యర్థుల నైపుణ్యాన్ని అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణకాలంలో వేజ్ అలవెన్స్ అందజేస్తామని అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికెట్లు, ఆధార్, బియ్యం కార్డు, ఉపాధి జాబ్ కార్డ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

'స్నో'యగం



ములియగుడ సమీపంలోని పొగమంచు

అనంతగిరి: మండల కేంద్రం అనంతగిరిలో శనివారం వింత వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత నెలకొంది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. అరకు–విశాఖ ప్రధాన రహదారిలో మంచు దట్టంగా కురవడంతో వాహనచోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు.

ఘోర ప్రమాదం.. మహా విషాదం



కుమారుడు హరి మృతితో రోదిస్తున్న తల్లి



కుమారుడు, భర్త మరణాన్ని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిన జానకి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

- దుమ్మబుడ్రి ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు
- కుటుంబ సభ్యుల రోదనలతో నిండిన అరకు ఏరియా ఆస్పత్రి

సాక్షి, పాడేరు/అరకులోయ టౌన్/అరకులోయ రూరల్: మన్యంలో విషాదం నిండుకుంది. అందరి మనసుల్లో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదమే సుడులు తిరిగింది. శివరాత్రి జాతరకు వెళుతుండగా బైక్‌లు ఢీకొని బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కొంతిరి మోహన్‌ను కేజీహెచ్‌కు తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి ఎస్.కోట ఘాట్‌లో మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అరకులోయ నుంచి లోతేరు పోయే రోడ్డులో దుమ్మబుడ్రి గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శివరాత్రి జాతర చూసేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి వెళుతున్న మూడు బైక్‌లు అతి వేగంగా వెళ్లడమే ప్రమాదానికి కారణమని ఎస్ఐ సంతోష్ తెలిపారు. అరకులోయ మండలం చినలబుడు గ్రామానికి చెందిన హరి (18), అమలకాంత్ (9) రాత్రి 10 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై నందివలసలోని శివరాత్రి జాతరకు బయలుదేరారు.అలాగే లోతేరు పంచాయతీ గానుగవలస గ్రామం నుంచి గుబాయి త్రినాథ్ (32), గుబాయి సింహాద్రి(29), గుబాయి భార్గవ్(7), పెదవలస గ్రామానికి చెందిన కొంతిరి మోహన్(30) మరో బైక్‌పై ఎం.హట్టగుడ గ్రామంలోని శివరాత్రి జాతరకు బయలుదేరారు. లోతేరు రోడ్డులో ఈ రెండు బైక్‌లు వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో బైక్‌లపై ప్రయాణిస్తున్న గిరిజనులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. సంఘటన స్థలంలోనే హరి, అమలకాంత్, చగుబాయి సింహాద్రి తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే చినలబుడు పంచాయతీకి చెందిన కిల్లో పరశురామ్, కిల్లో సతీష్‌లు మరో బైక్‌పై నందివలస శివరాత్రి జాతరకు వెళుతూ.. రోడ్డుపై పడిఉన్న బైక్‌లను ఢీ కొట్టడంతో వారు కూడా తీవ్ర గాయాలపాలయ్యారు. సమీపంలోని గిరిజనులతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహన చోదకులంతా ఈ ప్రమాద సంఘటనను చూసి గాయాలపాలైన వారిని హుటాహుటిన అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్గవ అనే బాలుడు మృతి చెందగా.. కేజీహెచ్‌కు తరలిస్తున్న సమయంలో గుబాయి త్రినాథ్ ప్రాణాలు కోల్పోయాడు.




గుబాయి త్రినాథ్ (ఫైల్), గుబాయి సింహాద్రి (ఫైల్)



గుబాయి భార్గవ్ (ఫైల్)



హరి (ఫైల్)



అమలేకాంత్ (ఫైల్)

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

ఈ ప్రమాదంలో ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో గానుగవలస గ్రామంలోని గిరిజనులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబాయి త్రినాథ్‌తోపాటు అతని తమ్ముడు గుబాయి సింహాద్రి అక్కడికక్కడే మృతి చెందారు. సింహాద్రి కుమారుడు భార్గవను స్థానికులు అరకులోయ ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో భర్త సింహాద్రి, కుమారుడు భార్గవలను కోల్పోవడంతో గుబాయి జానకి కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఆమె సొమ్మసిల్లి పడిపోగా బంధువులు సపర్యలు చేశారు. గానుగవలస గ్రామంలోని గిరిజనులంతా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు.



అరకు ప్రాంతీయ ఆస్పత్రిలోని మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

చినలబుడులోను విషాదం

బురిడి హరితోపాటు గిరిజన బాలుడు గొల్లూరి అమలకాంత్‌లు ఈ ప్రమాదంలో మృతి చెందడంతో చినలబుడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చినలబుడు గ్రామంలోని గిరిజనులు కూడా అరకులోయ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి విలపించారు. హరి తల్లి సోయిత ఆస్పతి వద్ద కన్నీరుమున్నీరైంది. రఘునాథ్ కుమారుడైన అమలకాంత్ జాతర చూసి వస్తానని సరదా పడి వెళ్లి ఈ ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లిపోవడం తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చింది. ఐదుగురు గిరిజనుల మృతదేహాలకు వైద్యులు శవపరీక్షలు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ఎమ్మెల్యే పాల్గుణ సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి బాధాకరమని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీలోని మృతదేహాలను ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. బాధిత కుటుంబాలను, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు కిల్లో పరశురాం, కిల్లో సతీష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

రెగ్యులర్ టీచర్లుగా సీఆర్టీలు

61 మందికి ఆర్డర్లు అందజేసిన కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 61 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు రెగ్యులర్ చేస్తూ కలెక్టర్ విజయ సునీత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని శనివారం తన క్యాంపు కార్యాలయంలో సీఆర్‌టీలకు అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

బోడిదొరకు పలువురి నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గాం గంటందొర, గాం మల్లుదొర మనువడు బోడిదొర మృతి పట్ల పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సంతాపం తెలిపారు. ఆయన మరణ వార్తను తెలుసుకున్న ఆమె స్వగ్రామం లంకవీధి వెళ్లారు. ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి సంబంధించి ఉన్న ఏకైక వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. బోడి దొర కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. ఎంపీపీ బడుగు రమేష్, బట్టపనుకుల సర్పంచ్ బాలకృష్ణ, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర, ఎం.మాకవరం సర్పంచ్ రాజు పాల్గొన్నారు. జాతీయ అల్లూరి యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు,కార్యదర్శి శ్యామల, ఉపాధ్యక్షులు కొట్టుగుల్లి సుబ్బారావు, కొయ్యూరు ఆశ్రమ పాఠశాల పీడీ అంబటి నూకరాజు తదితరులు నివాళులర్పించారు. ఇలావుండగా శనివారం స్థానిక శ్మశాన వాటికలో గిరిజన సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.



బోడిదొర భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ తదితరులు

ఘనంగా శివరాత్రి మహోత్సవాలు

- మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా మహోత్సవాలు
- మత్స్యగుండంలో పోటెత్తిన భక్తులు
- మత్స్యలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివరాత్రి మహోత్సవ కార్యక్రమం చివరిరోజు కావడంతో ఏజెన్సీ నలుమూలల నుంచే కాకుండా మైదాన ప్రాంతం, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేవారు. మత్స్యగెడ్డలోని మత్స్య దేవతలను దర్శించేందుకు భక్తులు బారులు తీశారు. మత్స్య దేవతలకు ప్రసాదాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల నేపథ్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

మోదమాంబ తాపి మేస్త్రీల యూనియన్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హుకుంపేట జ్ఞానసాగర్ ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివరాత్రి మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఉత్సవాల్లో 200 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి భారీ భద్రత కల్పించారు. భక్తులు రాకపోకలకు 20 ఆర్టీసీ బస్సులతో బస్సు సౌకర్యం కల్పించారు. మూడు రోజుల పాటు ఎంపీడీవో వెంకటరావుతో పాటు రెవెన్యూ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు శాఖ, పోలీసు శాఖ, వైద్య శాఖలతో పాటు అన్ని శాఖల అధికార యంత్రాంగం శ్రమించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారు.



మత్స్యలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



మత్స్య దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ట్రాక్టరు బ్రేకులు ఫెయిలై బోల్తా

శ్రీకాకుళం యువకుడి మృతి, ఏడుగురికి గాయాలు

చింతపల్లి రూరల్: ట్రాక్టర్ బ్రేకులు ఫెయిలై వంతెన కిందకు దూసుకుపోయి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో అంతర్ల బ్రిడ్జి వద్ద శనివారం చోటు చేసుకుంది. మన్యంలో ఎన్‌హెచ్- 516 రహదారి నిర్మాణంలో భాగంగా విద్యుత్ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంబంధిత సిబ్బంది విద్యుత్ స్తంభాలు, సామగ్రిని పెంటపాడు నుంచి లంబసింగికి ట్రాక్టరులో తరలిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్ల బ్రిడ్జి వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలై దాని కిందకి దూకుసుకుపోయి బోల్తా పడింది. దాంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం సాగరవనవంగం గ్రామానికి చెందిన పత్రాసి సంతోష్ (25) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాహెల్, అన్వర్‌ఖాన్, జరీఫ్‌లకు వైద్యురాలు రుక్మిణి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి సిఫార్సు చేశారు.



సంతోష్ మృతదేహం